క్లుప్తంగా

ఏఎంసీ చైర్ పర్సన్‌కు పలువురి అభినందన



గన్నవరం రూరల్ : గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తోట కరుణను శనివారం పలువురు అభినందనలు తెలియజేశారు. సూరంపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు బండి శివరామయ్య, తులాబందుల సత్యానారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలో ఏఎంసీ ద్వారా మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు. వారికి చైర్‌పర్సన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆక్రమణల తొలగింపు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూమి ఆక్రమణకు గురైంది. ఆ విషయం తెలుసుకున్న దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులు, అర్చకులు శనివారం పరిశీలించి ఆ భూమిని రక్షించారు. నున్న–ముస్తాబాదు రోడ్డు సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ వేశారు. ఆ వెంచర్‌లోకి వెళ్లేందుకు దేవదాయశాఖకు చెందిన భూమిని ఆక్రమించుకుని రోడ్డు నిర్మించారు. తమ భూమి ఆక్రమణకు గురైనట్టు ఆలయ అర్చకులు గుర్తించి దేవదాయశాఖ అధికారులకు తెలియజేశారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.అరుణ ఆక్రమణలకు గురైన భూమిని అర్చకులతో పాటు వచ్చి పరిశీలించారు. రోడ్డు నిర్మించిన భూమి శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూమిగా అర్చకులు కనగాల రామకృష్ణారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి అరుణ తెలిపారు. ఆక్రమణకు గురైన భూమి అర్చకుల (వారసత్వం)కు అస్సైన్ చేసినట్టు ఈఓ పేర్కొన్నారు. అర్చకులు రామకృష్ణారావు కుటుంబ సభ్యుల జీవనోపాధితో శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి సుమారు ఎనిమిది ఎకరాల భూమిని దేవదాయశాఖ కేటాయించిందని పేర్కొన్నారు. అందులో 10 సెంట్ల భూమిని రియల్ ఎస్టేట్ వారు ఆక్రమించుకుని రోడ్డు నిర్మించినట్టు తెలిపారు. ఆ భూమి ఆక్రమణకు గురైనట్టు నున్న పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసి, రోడ్డును జేసీబీతో తొలగించినట్లు పేర్కొన్నారు. ఆమెతో పాటు అర్చకులు కనగాల రామకృష్ణారావు, మామిళ్లపల్లి ఫణికుమార్, దత్తు, రాము, దేవదాయశాఖ సిబ్బంది సుబ్బారావు ఉన్నారు.

ముగ్గుల పోటీలు



ఉంగుటూరు: సంక్రాంతిని పురస్కరించుకుని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆత్కూరులో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు సంస్కృతిని ప్రతిబింబంచే విధంగా హరిదాసు, సిరిధాన్యలు, సంక్రాంతి ముగ్గుల రంగవల్లులు చూపరులను అలరించాయి. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఆత్కూరు ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. బి.సందీప్ ప్రథమ, పుష్ప ద్వితీయ, శిరీష తృతీయ స్థానాలు సాధించారు. అనంతరం విజేతలకు ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, ఎంపీటీసీ సభ్యురాలు శివకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు సింహాచలం, ఆశీర్వాదం, ప్రభాకర్, ముస్తఫా, కార్యదర్శి సాయిబాబా పాల్గొన్నారు.

గన్నవరంలో..

గన్నవరం: ముత్తూట్ ఫిన్‌కార్ప్ గన్నవరం బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లి గ్రామంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు, యువతులు అధిక సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొన్ని రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఫిన్‌కార్ప్ రీజినల్ మేనేజర్ బాల, ఏరియా మేనేజర్ కృష్ణ, బ్రాంచ్ మేనేజర్ ధనుంజయ్ పాల్గొన్నారు.



మొదటి బహుమతి అందజేస్తున్న ముత్తూట్ ప్రతినిధులు

పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శనివారం నుంచి సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. భోగి పండగను ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయ దర్శనం ప్రారంభమైంది. ఉదయం నుంచి భక్తులు వాహనపూజలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు.

గ్రామంలోని భక్తులతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి, శ్రీ వెంకమ్మ తల్లి, శ్రీ వినుకొండ వెంకమ్మ తల్లి విగ్రహాలకు భోగి పండ్లను పోశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్‌లు మాట్లాడుతూ మకర సంక్రాంతి, కనుమ పండగను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఆలయం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరం వద్ద వాహన పూజలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



అమ్మవార్లకు భోగి పళ్లు పోస్తున్న అర్చకులు



అన్న సంతర్పణకు విరాళం అందజేస్తున్న విన్నకోట నాగ వెంకట సాయి భావన

అన్నసంతర్పణకు రూ.35వేల విరాళం

సంక్రాంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఈ నెల 20న ఆలయంలో నిర్వహించే అన్నసంతర్పణకు కోన నాగేశ్వరరావు మనువరాలు విన్నకోట నాగ వెంకట సాయి భావన రూ.35వేల విరాళాన్ని ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరికిఅందజేశారు.

వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలి

పెనమలూరు: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా సకాలంలో వేయాలని జిల్లా వైద్యాధికారి గీతాబాయ్ అన్నారు. పెనమలూరు సచివాలయం–2 పరిధిలో వ్యాధి నిరోధక టీకాలు వేసే ప్రక్రియను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. వ్యాధి నిరోధక టీకాల కేంద్రాలను అవసరమైతే పెంచి సకాలంలో టీకాలు వేయలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో కూడా మందులు సకాలంలో పంపిణీ చేయాన్నారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ సర్వే చేసి వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారికి వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెనమలూరులో టీకాల ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయ్

ఘనంగా యువజన దినోత్సవం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో శనివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన దినోత్సవ వేడుకలను కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాసిక్‌లో జరుగుతున్న 27వ జాతీయ యువజనోత్సవాలను ప్రారంభించి దేశ యువతనుద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని విద్యార్థులు లైవ్‌లో వీక్షించారు. అనంతరం జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు. అర్బన్ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో పాలుపంచుకున్న విద్యార్థులకు టీషర్ట్స్, క్యాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చెంచమ్మ, జిల్లా యువ అధికారి సుంకర రాము, అధ్యక్షుడు మధు, ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ

అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదు స్వాధీనం

రామవరప్పాడు: వేర్వేరు కారుల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదును పటమట పోలీసులు శనివారం ఎనికేపాడు పార్కింగ్ ప్లేస్ వద్ద పట్టుకున్నారు. ఈ విషయంపై పటమట సీఐ కాశీవిశ్వనాథ్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలు పటిష్టం చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఎనికేపాడులో తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న కారులో తెలంగాణ మద్యం 15 ఫుల్ బాటిల్స్, 63 క్వార్టర్ బాటిల్స్ పట్టుబడ్డాయన్నారు. అలాగే హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతున్న కారులో తగిన ఆధారాలు చూపకుండా తరలిస్తున్న రూ.10 లక్షలను కూడా గుర్తించినట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదును స్వాధీనపరచుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలపై పూర్తి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీల్లో పట్టుపడ్డ నగదు, మద్యం బాటిల్స్‌ను చూపుతున్న పటమట సీఐ కాశీ విశ్వనాథ్

రహదారి భద్రతపై అవగాహన తప్పని సరి

గన్నవరం రూరల్: యువత రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని గన్నవరం ట్రాఫిక్ ఎస్సై దుర్గారావు సూచించారు. చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాలలో రహదారి భద్రతా వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా శనివారం సదస్సు జరిగింది. నెహ్రూ యువకేంద్రం, స్థానిక ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. అవగాహనతో రహదారి దుర్మరణాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, సీట్ బెల్టు పెట్టుకోవడం, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపకుండా ఉండటం పాటించాలన్నారు. తమ కుటుంబం పట్ల బాధ్యతతో ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని చెప్పారు.ట్రాఫిక్ కూడళ్లలో మై భారత్ టీషర్టు, క్యాప్, బ్యాడ్జీ ధరించిన వలంటీర్‌లకు సహకరించాలన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.వందన, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రశాంతి, నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి సుంకర రాము తదితరులు పాల్గొన్నారు.



రహదారి భద్రతా వారోత్సవాల సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై దుర్గారావు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. 2008 నుంచి 2022 వ సంవత్సరం వరకు వికాస్ కళాశాల్లో విద్యనభ్యసించి దేశ, విదేశాల్లో ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యార్థి దశలోని మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను గుర్తుంచుకోవాలని వివిధ కోర్సుల్లో చదివిన పూర్వ విద్యార్థులు వారి గురువులకు కనిపించి ఆశీస్సులు పొందారు. అదే సమయంలో విద్యాసంస్థలను నెలకొల్పి విద్యాప్రదాతగా ఉన్న వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డిని కలిసి ప్రేమపూర్వకంగా కృతజ్ఞతలను తెలియజేశారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో జంక్షన్ క్రీడాకారుల ప్రతిభ



హనుమాన్‌జంక్షన్ రూరల్: నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో హనుమాన్‌జంక్షన్‌కు చెందిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ క్రీడాకారులు 11 పతకాలు సాధించి సత్తా చాటారు. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు ఢిల్లీలోని తల్కాటోరా ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ క్రీడాకారులు సబ్ జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని కోచ్ కట్టా సుధాకర్ శనివారం వివరించారు. సబ్ జూనియర్స్ సెమీ కాంటాక్ట్ ఫైట్స్ కేటగిరిలో కట్టా మనోజ్, హారికా ధనలక్ష్మి సిల్వర్ మెడల్స్ సాధించారని చెప్పారు. జాతీయస్థాయిలో అత్యధిక పతకాలను సాధించి ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ విద్యార్థులను పలువురు పుర ప్రముఖులు అభినందించారు.

అంబేడ్కర్ స్మృతివనం పరిశీలన



పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని స్వరాజ్‌మైదాన్‌లో ఈ నెల 19వ తేదీన అంగరంగ వైభవంగా ప్రారంభంకానున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంబేడ్కర్ స్మృతివనం రాష్ట్రానికి మైలురాయి కాబోతుందని, ఇప్పటికే నగరానికి మకుటంలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి ప్రారంభించి జాతికి అంకితమిస్తారని చెప్పారు. ప్రారంభ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. స్మృతివనంలో ఏర్పాటు చేసిన ఫౌంటేన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు.

పెళ్లి కుమారుడిగా రంగనాథస్వామి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన రంగనాథ స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అలాగే శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం స్వామివారికి కల్యాణం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి తెలిపారు.

మధురానగర్‌లో..

మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీసాయిబాబా మందిరంలో శనివారం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. మందిర వ్యవస్థాపకుడు పీవీఎల్ఎన్ రాజు, లక్ష్మీతులసి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గోదారంగనాథ కల్యాణం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మందిర వ్యవస్థాపకుడు రాజు కోరారు. కార్యక్రమాలను సత్యప్రసాద్, కోనేరు మంజులరాణి, మలిశెట్టి బాలవర్ధనరావు తదితరులు పర్యవేక్షించారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని కొత్తపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 39 క్వార్టర్ బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటలో ఓ మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు పేటలో తనిఖీ నిర్వహించగా, కోలా సరోజిని అనే మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆమెను అరెస్ట్ చేసి 9 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇక వైఎస్సార్ కాలనీలో మద్యం విక్రయిస్తున్న కొణదల సుబ్బారావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 30 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: శ్రీ వీణా కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల సందర్భంగా గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు యశస్వి ఆధ్వర్యంలో అమర గాయకులు ఘంటసాల, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, భానుమతి, బహుభాషా గాయకుడు జేసుదాసు గానం చేసిన చిత్రగీతాలను సత్యస్వాతి, రాజుతోపాటు పలువురు గాయనీ గాయకులు ఆలపించారు.

తుదిదశలో బస్టాండ్ నిర్మాణ పనులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టింది. దాదాపు ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోవడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.4.40 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం చేపట్టింది. ఈ నూతన భవనాల నిర్మాణ పనులు దాదాపుగా తుది దశలో ఉన్నాయి.

రూ.4.40 కోట్లతో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని హనుమాన్‌జంక్షన్‌లోని ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు సమూలంగా మారిపోతున్నాయి. 1966లో నిర్మించిన ప్రస్తుత బస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో రూ.4.40 కోట్ల వ్యయంతో హనుమాన్‌జంక్షన్ నూతన బస్టాండ్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ఏడు బస్టాండ్లను అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ఇంటిగ్రేటెడ్ స్టేషన్లుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన కార్యాచరణలో భాగంగా హనుమాన్‌జంక్షన్‌ను కూడా ఎంపిక చేసింది. సుమారు 1.23 ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్ నూతన భవన సముదాయాలను నిర్మించనుండగా, హైవేకు అనుకుని ఉన్న 20,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో వ్యాపార, వాణిజ్య సముదాయం ఏర్పాటు చేయనున్నారు. రోజుకు దాదాపు 1000కుపైగా బస్సుల రాకపోకలు, ఐదు వేల మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఈ బస్ స్టేషన్ బహుళ ప్రయోజన కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. నూతన బస్టాండ్‌లో పది ప్లాట్‌ఫాంలతో పాటుగా కార్యాలయం, బస్‌పాస్ కౌంటర్, డ్రైవర్ల విశ్రాంతి గది, ఎనిమిది షాపులు, హోటల్, కొరియర్ గది ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే బస్టాండ్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది. ప్రస్తుతం ప్లాట్‌ఫాం లెవలింగ్ పనులు, రంగులు వేయటం చేస్తున్నారు. మరో నెల రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



తుదిదశ పనుల్లో హనుమాన్‌జంక్షన్ నూతన బస్టాండ్

మండల దీక్ష పారాయణ ప్రారంభం

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రీలలిత సహస్రనామ మండల దీక్ష పారాయణం శనివారం ప్రారంభమైంది. ఫిబ్రవరి 23వ తేదీన జరగనున్న అమ్మవారి వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని మండల దీక్షను చేపట్టారు. తొలుత కాసరనేని బాబూరావు, బేబీసరోజిని దంపతులతో కలశ స్థాపన ద్వారా మండల దీక్షకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. రోజూ సాయంత్రం ఏడు గంటలకు శ్రీతిరుపతమ్మ మాతృమండలి సభ్యులతో శ్రీలలిత సహస్రనామ పారాయణం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు.



శ్రీలలిత సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు

అన్నింటా తోడూ.. నీడగా..!

కష్టమైనా.. సుఖమైనా.. ఒకరికొకరు తోడూ.. నీడ అంటారు. అందుకు ఈ ఫొటోనే సాక్ష్యం. ప్రొద్దుటూరులోని వ్యవసాయక్షేత్రంలో రబీ సాగు పనులకు రైతు కుటుంబం సమాయత్తం అవుతోంది. అందులో భాగంగానే దమ్ము చేసేందుకు పొలంలో యూరియా చల్లుతున్నారు భానుప్రకాష్ దంపతులు. శనివారం కనిపించిన ఈ దృశ్యాన్ని సాక్షి తన కెమెరాలో బంధించింది.

– కంకిపాడు

